# ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలోని ఇటుక బట్టీలలో మగ్గుతున్న ఒడిషా వలస కార్మికులు

**ఆంధ్రప్రదేశ్,** తెలంగాణా రాష్ట్రాలలో సుమారు 3 వేల ఇటుకబట్టీలు ఉన్నాయి. ఒక్కొక్క బట్టీలో ఒడిషా నుండి వచ్చిన 15 నుండి 20 కుటుంబాలు పని చేస్తున్నాయి.

నష్టదాయకమైన వ్యవసాయం, అడవులు తరిగిపోవటం, సాంప్రదాయక జీవనం ధ్వంసం కావటంతో ఒడిషాలోని పశ్చిమ ప్రాంత జిల్లాలైన కలహండి, కోరాపుట్, బాలంఘీర్ జిల్లాల ప్రజలు ఇతర రాష్ట్రాలకు వలసబాట పట్టవలసి వచ్చింది. ఈ పరిస్థితే – రెండు తెలుగు రాష్ట్రాలలోని, ఏమాత్రం క్షేమకరంకాని బట్టీలలో ప్రమాదకరమైన పనులు చేసేవైపు వారిని నెట్టింది.

ప్రతి సంవత్సరం అక్టోబరు, జూన్‌ల మధ్య కాలంలో ఒడిషా నుండి ఆంధ్రప్రదేశ్‌కు సుమారు 2 లక్షల మంది ప్రజలు వలస వస్తున్నారు. సర్దార్లుగా పిలవబడే స్థానిక ముఠామేస్త్రులు వీరిని ఇటుక బట్టీలలో పనికి పంపుతున్నారు. వ్యవసాయరంగ సంక్షోభ బాధితులైన చిన్న, సన్నకారు రైతాంగం కూడా ఈ వలస కార్మికులలో ఉన్నారు. ఈ కార్మికులు యజమానుల దౌర్జన్యాలకు తీవ్రంగా గురవుతున్నారు.

2015 జనవరిలో ఇటుక బట్టీలకు కార్మికులను సరఫరా చేసే కాంట్రాక్టర్లు ఇద్దరు కార్మికుల చేతులను నరికివేశారు.

2015 డిసెంబరు 3న గర్భిణీ అయిన ఒక మహిళా కార్మికురాలు జ్వరంతో ఉండి పనికి రానందుకు, ఆమె యజమాని ఆమెను తీవ్రంగా కొట్టగా ఆమె మరణించింది. వలస కార్మికులపై ఈ రకమైన దురాగతాలు ఇటుక బట్టీలలో సాధారణమైపోయాయి.

ఈ కుటుంబాలు చాలీచాలని చిన్న గుడిసెల్లో, పరిశుభ్రమైన నీరు లభించని, వైద్య సదుపాయం లేని స్థితిలో జీవిస్తున్నారు. నూకల అన్నంతోటే వారు బ్రతుకుతూ రోజుకు 16 నుండి 18 గం॥ నిర్బంధపు చాకిరీ చేస్తున్నారు.

కనీసవేతన చట్టం 1000 ఇటుకలకు కూలి రూ.420/- ఇవ్వాలని చెబుతున్నప్పటికీ, ఆ కార్మికులకు చెల్లిస్తున్నది రూ.180/- నుండి రూ.250/- వరకు మాత్రమే. కానీ ఒక్కొక్కళ్ళు సీజన్‌లో 3 లక్షల ఇటుకలను తయారుచేసి తీరాలనే వత్తిడి వారిపై కొనసాగుతోంది.

ప్రతి సంవత్సరం ఈ బట్టీలలో 50 నుండి 70 వరకు లైంగికవేధింపులు, మరణాలు నమోదవు తుంటాయి.

పిల్లలు కూడా తప్పనిసరిగా పనిచేయాల్సిందే. 6 సం॥ పిల్లలు కూడా తెల్లవారు ఝామున 3.30 గం॥లకే లేచి ఉదయం 9 గం॥ల వరకు పని చేయాల్సిందే. మళ్ళీ సాయంత్రం 3 గం॥ల నుండి ఇతర పనుల్లో, యజమానుల సేవలో ఉండాలి. బట్టీల యజమానులు పిల్లలకు ప్రత్యేకంగా జీతాలంటూ ఏమీ ఇవ్వరు. ఇటుక బట్టీలకు వెట్టి కూలీలుగా వారు కట్టివేయబడ్డారు.

అంతర్‌రాష్ట్ర వలసల చట్టంగానీ, వెట్టిచాకిరి రద్దు చట్టంగానీ ఏవీ కూడా ఈ కార్మికులను రక్షించటంలేదు. ఎందుకంటే పాలకులు, అధికారులు అందరూ బట్టీల యజమానులకే అనుకూలంగా ఉన్నారు. పీడిత ప్రజానీకం పట్ల మన వ్యవస్థ కూడా అందుకు భిన్నంగా ఏమీ లేదు.

## అంతర్‌రాష్ట్ర వలసకార్మికుల వెతలు

మన పాలకులు అనుసరిస్తున్న నూతన సరళీకృత ఆర్థిక విధానాలు సృష్టించిన వ్యవసాయరంగ సంక్షోభం గ్రామీణ ప్రజల జీవనాన్ని ధ్వంసం చేసింది. దీనికి తోడు కరువు పరిస్థితులు వారిని మరింత కష్టాలలోకి నెట్టాయి. వ్యవసాయరంగానికి సంబంధించిన మౌలిక వసతులన్నింటినీ పూర్తిగా నిర్లక్ష్యం చేసిన ఫలితంగా ప్రజల జీవితాలు అల్లకల్లోలమవుతున్నాయి.

జీవనోపాధి లేక, మరో ప్రత్యామ్నాయం లేక గ్రామీణ ప్రాంత ప్రజానీకం ఉపాధి కొరకు ఇతర రాష్ట్రాల బాట పట్టవలసిన పరిస్థితి ఏర్పడింది. వ్యవసాయంలో వారెంత నిష్ణాతులైనప్పటికీ, రోజు కూలీలుగా వారు నైపుణ్యంలేని అనేక కష్టభూయిష్టమైన పనులను చేయవలసి వస్తోంది. వీరిలో చాలామంది వెట్టికూలీలుగా మిగులుతున్నారు. యజమాని వద్ద తీసుకున్న అప్పు, తరాల తరబడి కొనసాగుతూ ఉండే పాత వెట్టి పద్ధతికి తోడు, కొత్త వెట్టి రూపం ఒకటి ఉనికిలోకి వచ్చింది. అధిక వడ్డీలకు అప్పు లివ్వటం ద్వారా భూస్వాములు కూలీలను తమ అదుపులో ఉంచుకునే పద్ధతి ప్రస్తుత వ్యవసాయ విధానంలో కొనసాగుతోంది. ఇది వ్యవసాయరంగ పరిధిని దాటి ఇటుక బట్టీలు, అగరుబత్తి యూనిట్లు, క్వారీలు, గనులు, నిర్మాణరంగం, మగ్గాలు ఇంకా నగరాల నడిబొడ్డున ఇళ్ళల్లో పనిమనుషుల వరకు విస్తరించింది.

బీహార్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, పశ్చిమబెంగాల్, అసోం, గుజరాత్, చత్తీస్‌ఘడ్, ఒడిషా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల గ్రామీణ ప్రాంత ప్రజానీకం జీవనోపాధిని వెతుక్కుంటూ ఇతర రాష్ట్రాలకు వలస బాట పడుతున్నారు. వీరిలో అధికులు భూమిలేనివారు కాగా, 90 శాతం మంది పీడిత కులాలకు చెందినవారే.

తరచుగా ఈ వలస కార్మికులు వివిధ ప్రదేశాల నుండి సర్దార్లచే (లేబర్ కాంట్రాక్టర్లచే) సమీకరించ బడతారు. ఈ సర్దార్లకు కొంత సొమ్ము అడ్వాన్సుగా చెల్లించిన తర్వాతగానీ, లేదా అనుకున్నట్లుగా పని ముగించాక ఒక మొత్తాన్ని చెల్లిస్తామని హామీ ఇచ్చాక మాత్రమే వారికి పని చూపించబడుతుంది. ఒకసారి వాళ్ళు పనిలో చేరాక రోజుకు 18 గం॥ శారీరక శ్రమ చేయాల్సి ఉంటుంది. భౌతిక హింసలకు గురి అవటం తప్పదు. మహిళా కార్మికులైతే లైంగిక వేధింపులకు, దాడులకు గురవటం తప్పదు.

ఈ అత్యాచారాలను, వెట్టికూలీని అరికట్టటానికి చాలా చట్టాలున్నప్పటికీ, సంబంధిత అధికారులు, గ్రామీణ ప్రాంతాలలో ఫ్యూడల్ పెత్తందార్లకున్న పట్టు అజమాయిషీల వల్ల ఈ చట్టాలను అమలుపరచటానికి పూనుకోరు. ప్రభుత్వాలు ఈ వలస కార్మికుల, వెట్టికూలీల దుస్థితిపట్ల అత్యంత నిర్లక్ష్య భావంతో ఉన్నాయి. వెట్టిచాకిరీ పట్ల ప్రభుత్వాలు ఈ విధమైన ఉదాశీనతతో ఉండటం నేరం.

వెట్టిచాకిరీకి సంబంధించి కొన్ని ఘటనలు వెల్లడైన పరిస్థితుల్లో, అవి మీడియాలో ప్రస్ఫుటంగా వెల్లడైనప్పుడు అధికారులు మాత్రం మొక్కుబడిగా కొన్ని సహాయకచర్యలు చేపడుతున్నారు. కానీ వెట్టికూలీలకు సంబంధించిన పునరావాస కార్యక్రమమేదీ రాజ్యం వద్ద లేనందున, ఇటువంటి సహాయకచర్యల అనంతరం ఆ వెట్టికూలీల పరిస్థితి మరింత దుర్భరమౌతున్నది.

ఉదాహరణకు శ్రీరంగపట్నానికి సమీపంలో గల హంగార హళ్ళిలోని ఒక క్వారీలో 5గురు కార్మికులను గొలుసులతో కట్టివేసి, రోజంతా పనిచేయిస్తున్న విషయాన్ని 2013లో కర్ణాటక రాష్ట్ర రైతుసంఘం వెలుగులోకి తీసుకొచ్చినప్పుడు, అధికారులు పూనుకొని ఆ కార్మికులకు వెట్టి నుండి విముక్తి కల్పించారు. కానీ బ్రిటీషు రచయిత అయిన పాట్రిక్ ఫ్రెంచ్ ఎంతో ప్రాచుర్యం కల్పించబడిన ఈ కేసులో బాధితులను చూడటానికి వెళ్ళినప్పుడు, ఆశ్చర్యకరంగా వారొక గ్రామంలోని గుడి వద్ద అడుక్కుంటున్నారు. ఈ అనుభవాన్ని ఆయన 'ఇండియా – ఎ పోర్ట్రెయిట్' అనే తన పుస్తకంలో ప్రస్తావించాడు.

## కట్టుబానిసలుగా మారిన చేనేత కార్మికులు

అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాలకు చెందిన అనేకమంది చేనేత కార్మికులు ఫ్యాక్టరీ యజమానుల వద్ద అడ్వాన్సులు తీసుకొని, ఫ్యాక్టరీ ఆవరణలోని షెడ్లలో ఉంటూ కట్టుబానిసలుగా జీవిస్తున్నారు. వారికి చెల్లించవలసిన వేతనాల నుండి ఈ అడ్వాన్సు మినహాయించబడుతుంది. ఈ షెడ్లను దాటి వారు బయటకు వెళ్ళటానికి వీలులేదు. వీరికి రోజుకు లభించే వేతనం అత్యల్పం. రూ.100/– నుండి రూ.150/– వరకు మాత్రమే వీరు రోజుకు పొందగలుగుతారు. చాకిరీ మాత్రం రోజంతా చేయాల్సిందే. కొన్ని ఫ్యాక్టరీలలో అయితే కుటుంబం మొత్తం మగ్గాలపై పనిచేయాల్సిందే. వీరు బయటకు వెళ్ళటానికి ప్రయత్నిస్తే, భౌతికదాడులు తప్పవు.

అనంతపురం జిల్లాలో ఇటువంటి షెడ్డు ఫ్యాక్టరీలు పదుల సంఖ్యలో ఉన్నాయి. కానీ చట్టవిరుద్ధంగా ఈ ఫ్యాక్టరీలను నిర్వహిస్తున్న యాజమాన్యాలపై అధికారులు ఏవిధమైన చర్యలూ తీసుకోవటంలేదు. ప్రతి షెడ్డు ఫ్యాక్టరీలోనూ కార్మికులు 100, 200 మగ్గాలపై పనిచేయాలి. ఈ కార్మికులు, వారి కుటుంబాలు ఫ్యాక్టరీలోనే నివాసముండాలి. ఒకవేళ అధికారులు తనిఖీకి వస్తే, ఆ సమాచారం యాజమాన్యానికి ముందే చేరుతుంది. ఇక తనిఖీ రోజుల్లో షెడ్డు ఫ్యాక్టరీలు ఏవిధమైన ఆధారాలు లభ్యం కాకుండా మూత పడతాయి. ఈ విధంగా వందలాదిమంది చేనేత కార్మికులు షెడ్డు ఫ్యాక్టరీలకు బంధించబడి, ఈ వెట్టిచాకిరి నుండి బయటపడటానికి ఏవిధమైన అవకాశంలేక మగ్గాలపైనే మగ్గిపోతున్నారు.

## ఆంధ్రప్రదేశ్‌లోనూ, ఇతర రాష్ట్రాలలోనూ వ్యవసాయ – వలస కూలీల దుస్థితి

ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ కరువు ప్రాంతాల నుండి, మరో ప్రత్యామ్నాయమేదీ లేనందువల్ల అనేక మంది వ్యవసాయ కూలీలు, చిన్నరైతులు జీవనోపాధి వెతుక్కుంటూ కేరళ, కర్నాటక రాష్ట్రాలకు వలస పోయారు. వీరు కొచ్చిలోను, బెంగుళూరులోనూ అడుక్కుతినేవారుగా, సఫాయి పనులు చేసేవారుగా, కనీసపాటి అవసరాలు కూడా తీరని స్థితిలో జీవిస్తున్నారని, వారి దయనీయ పరిస్థితులను వెల్లడి చేస్తూ ఇటీవలే అనేక వార్తలు వచ్చాయి. మరీ ముఖ్యంగా కదిరి డివిజన్‌లోని 52 గ్రామాల నుండి వచ్చిన వలస కార్మికుల పరిస్థితి హృదయాన్ని కలచి వేసేదిగా ఉంది. ఈ వార్త మీడియాలో ప్రచురితం కాగానే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నానా హంగామా చేసింది. ప్రభుత్వాధికారుల బృందాన్ని కొచ్చికి, బెంగుళూరుకి పంపి మూకుమ్మడి వలసలకు కారణాన్ని అధ్యయనం చేయాల్సిందిగా, ఈ సమస్యకు ఒక పరిష్కారాన్ని కనుగొనాల్సిందిగా కోరింది. కానీ 3 నెలల తర్వాత కూడా వారి పరిస్థితిని మెరుగుపరచటానికి అవసరమైన నిర్దిష్ట చర్యలేవీ తీసుకోలేదు.

## ఒడిషాలో నిర్బంధించబడిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వలస కార్మికులు

2015 నవంబరు నెలలో చివరిరోజు 'ఒడిషాలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వలస కార్మికుల నిర్బంధ'మంటూ మీడియాలో వార్త ప్రచురితమైంది. రామకుప్పం మండలంలోని బల్లా గ్రామానికి చెందిన ఐదుగురు వలస కార్మికుల కుటుంబసభ్యులు, ఒడిషాలోని భువనేశ్వర్‌లోని వారి యజమాని వద్ద నిర్బంధించబడి ఉన్నట్లు తెలియచేశారు. ఈ కార్మికులు గత 8 సంవత్సరాలుగా

అక్కడ పనిచేస్తూ, సంవత్సరానికి రెండుసార్లు ఇంటికి వచ్చి పోతున్నారు. వారు ట్రాన్స్‌ఫార్మర్లు, పారిశ్రామిక మోటార్లు బాగుచేసే పనిలో నియమించబడి ఉన్నారు.

6 నెలల క్రితం ఈ కార్మికులు తమను విడుదల చేయమని, తాము తమ స్వంత రాష్ట్రంలో స్థిరపడ తామని వారి యజమాని చెప్పారు. దీని తర్వాత వారికి జీతాల చెల్లింపు నిలిచిపోయింది. అది 8 లక్షల రూ॥ పైగానే. 2015 నవంబరు నెలలో కార్మికులకు యాజమాన్యానికి జరిగిన వాగ్వాదం తర్వాత ఈ ఐదుగురు కార్మికులను ఒక గదిలో నిర్బంధించి కొట్టారు. వారిలో ఒకరు తమ పరిస్థితి గురించి తన కుటుంబ సభ్యులకు వర్తమానం పంపించగలిగాడు. కానీ ఈ ఐదుగురితో వారి బంధువులు ఫోను ద్వారా సంభాషించ లేకపోయారు. ఇక వారు ఆంధ్రప్రదేశ్ పోలీసుల నాశ్రయించారు. నిర్బంధించబడిన కార్మికులను విడుదల చేయించాలని, వారికి తగిన రక్షణ కల్పించాలని కోరారు.

## వెట్టికూలీలుగా బాలకార్మికులు

దేశవ్యాప్తంగా అనేకమంది బాలకార్మికులు వెట్టికూలీలుగా పనిచేస్తున్నారనే వార్తా కథనాలు 2015 సంవత్సరమంతా వస్తూనే ఉన్నాయి. వెట్టిచాకిరీ చేయవలసిన పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో వెనుకబడిన తరగతులకు చెందిన కుటుంబాలు తమ పిల్లలను కూడా పనిలోకి పంపాలనే వత్తిళ్ళ మూలంగా ఈ బాలకార్మికులు వెట్టికూలీలుగా కొనసాగుతున్నారు.

హైదరాబాదులోని అధికారులు అనేక సందర్భాలలో కొన్ని వందల సంఖ్యలో పిల్లలను అక్రమంగా తీసుకువచ్చినట్లు గుర్తించారు. వీరంతా బీహార్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, పశ్చిమబెంగాల్‌కు చెందినవారు. వీరు గాజుల తయారీలో, ఎంబ్రాయిడరీ షాపుల్లో, బ్యాగులు తయారీలో, బంగారు ఆభరణాల తయారీలో, మానవమాత్రులకు ఏమాత్రం రక్షణలేని పరిస్థితుల్లో గంటల తరబడి పనిచేస్తున్నారు. వీరికి అతి తక్కువ వేతనం చెల్లించబడటంతోపాటు ఇంకా అదనంగా పనిచేయాలనే వత్తిడి కూడా ఉంటోంది.

'సేవ్ ది ఛిల్డ్రన్' అనే స్వచ్ఛందసంస్థ దేశ రాజధానిలోని వివిధ ప్రాంతాలలో 8 వేలమంది పిల్లలు వస్త్రపరిశ్రమల్లో పనిచేస్తున్నట్లు వెల్లడిచేసింది. అంతేకాదు ఇళ్ళల్లో పనిమనుషులుగా కూడా అనేకమంది పిల్లలు పనిచేస్తున్నట్లు సంస్థ వెల్లడిచేసింది. 13 శాతం మంది పిల్లలు అడ్డాలలో, ఇళ్ళే ఉత్పత్తి కేంద్రాలుగా ఉండే యూనిట్లలో పనిచేస్తున్నారని, ఇక్కడ ఒకరితో ఒకరికి సంబంధంలేని పిల్లలు, పెద్దవాళ్ళు కలిసి పనిచేస్తారని కూడా ఆ సంస్థ వెల్లడిచేసింది.

2015 ఆగస్టులో చెన్నైలోని ఒక బోర్‌వెల్ యూనిట్లో 52 మంది పిల్లలు నిర్బంధపు పని పరిస్థితులలో ఉండటాన్ని అధికారులు గుర్తించారు. వీరు ఛత్తీస్‌గడ్, ఒడిషాలకు చెందిన పిల్లలు. వీరికి ఒక వెయ్యి రూపాయలు అడ్వాన్సుగా ఇచ్చి, నెలకు 4,800 రూ॥ జీతంగా ఇస్తామని నమ్మబలికి తీసుకు వచ్చారు. కానీ వారికేనాడూ జీతం చెల్లించలేదు. తమిళనాడులోని నమక్కల్, సేలం, ధర్మపురి ప్రాంతాల నుండి అనేకమంది పిల్లలను నిర్బంధపు వెట్టిచాకిరి నుండి అధికారులు విముక్తిగావించారు. ఛత్తీస్‌గఢ్ నుండి వచ్చిన అనేకమంది మైనర్ బాలికలు, బెంగుళూరులో నిర్మాణపు పనులలో నిర్బంధపు చాకిరి చేస్తున్నారు.

వస్త్ర పరిశ్రమకు సంబంధించి అనేక అంతర్జాతీయ బ్రాండ్లు తమిళనాడులో తయారవుతాయి. ఇక్కడి స్పిన్నింగు మిల్లులలో పదుల వేల సంఖ్యలో బాల కార్మికులు తాళంవేసిన వసతి గృహాల్లో నిర్బంధించబడి ఉన్నారు. రోజుకు 10 గంటలకు తక్కువకాకుండా మధ్యలో విశ్రాంతి అనేది లేకుండా వీరు పనిచేయాలి. మరీ ముఖ్యంగా బాలికలు బానిసత్వంలో మగ్గి పోతున్నారు. ఫ్యాక్టరీ ఆవరణలోనే వారు నిర్బంధించబడి ఉన్నారు. బయటకు వెళ్ళటానికి వీలే లేదు. తరచుగా వారిని తిట్టటం, కొట్టటం జరుగుతుంది. ఈ బాలికలు లైంగికదాడులకూ గురవుతున్నారు. పనిచేసేచోట ప్రమాదాలు సర్వసాధారణం. కానీ రక్షణ చర్యలకు సంబంధించిన శిక్షణేమీ వీరికి ఇవ్వరు. అనేక రుగ్మతలతో వీరు బాధపడుతుంటారు. మానసిక వ్యాకులతలు కూడా ఉండి తరచుగా ఆత్మహత్యలు జరుగుతూ ఉంటాయి; బయటకు వెల్లడికాకుండా కప్పిపుచ్చబడతాయి.

ఆగస్టు 2015లోనే మరో ఘటన వెలుగు చూసింది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాలోని లోతట్టు గ్రామాల వెనుకబడిన తరగతుల కుటుంబాలకు చెందిన పిల్లలు బాలకార్మికులుగా ప్రమాదకర పరిస్థితులలో పనిచేయటానికి గుజరాత్, మధ్యప్రదేశ్, కేరళ ఇంకా మరికొన్ని రాష్ట్రాలకు తరలించబడ్డారు. వారి తల్లిదండ్రులు వడ్డీ వ్యాపారుల వద్ద చేసిన అప్పుకు వారిని పీల్చి పిప్పిచేసిన అనంతరం ఈ పిల్లలను ఆ అప్పుకిందే పనులకు తరలించారు. వీరు కట్టెల అడితీల్లో, ఆయిల్ ఫ్యాక్టరీలలో, సబ్బుల ఫ్యాక్టరీల్లో, రోజుకూలీలుగా, ఇంకా పలు కంపెనీల్లో పని చేస్తున్నారు. ఓడల్లో కూడా వీరు వంటచేయటం, శుభ్రంచేయటం వంటి పనులు చేస్తారు. తరచుగా వీరు లైంగికంగా హింసించబడతారు.

ooooo